## హెచ్ పి వి వ్యాక్సిన్ పై అవగాహన




**గుంతకల్లు, సెప్టెంబర్ 8, ( నేటి దర్శిని )**
గుంతకల్లులోని పాఠశాలల్లో అల్లు అర్జున్ అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌పీవీ (హెచ్ పి వి) వ్యాక్సిన్ పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఆడపిల్లలందరూ తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకొని, క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవికుమార్ విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా కార్యదర్శి నాసిర్,గుంతకల్లు అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడుఅనిల్, ఉపాధ్యక్షులు: హరీష్, వెంకీ పాటు అసోసియేషన్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివ స్వాముల ఇరుముడి కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణ, కమలమ్మ దంపతులు



**గుంతకల్లు, సెప్టెంబర్ 8, ( నేటి దర్శిని )**
మండల పరిధిలోని బుగ్గ సంగమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కర్నూలు జిల్లా కిసాన్ మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీ గుమ్మనూరు శ్రీధర్ ఇరుముడి పూజా కార్యక్రమంలో ఆలూరు మాజీ మార్కెట్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, బిజెపి నాయకురాలు కమలమ్మ దంపతులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ బుగ్గ సంగమేశ్వర ఆలయ పూజారి మంజునాథ స్వామి కొద్ది రోజుల క్రితం బైక్ లో వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం గుమ్మనూరు నారాయణ తెలుసుకొని ఆయనను పరామర్శించి వారి ఖర్చులకు రూ.5 వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణ, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందాలి

**- అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి: గుత్తి నరసింహ**



**చిట్వేలు, సెప్టెంబర్ 8, ( నేటి దర్శిని )**
అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాజుగుంట మాజీ సర్పంచ్, టీడీపీ యువ నాయకుడు గుత్తి నరసింహ కోరారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అర్హులైన వృద్ధులు, ఇతర కేటగిరీలకు చెందిన వారికి పెన్షన్ అందేలా చూడాలన్నారు.కొత్తగా పెన్షన్‌కు అర్హత పొందిన వారు ప్రభుత్వం ఇచ్చిన గడువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలని సచివాలయ సిబ్బందిని కోరారు. పెన్షన్ కోసం అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు ఉంటే గుర్తించి వారికి అవకాశం కల్పించాలని అన్నారు.అధికారులు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అందుబాటులో ఉండి, కొత్త పెన్షన్లకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తారని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎండీఓ శ్రీనివాసులు, డిప్యూటీ ఎండీఓ అనిల్, జనసేన నాయకుడు మాదాసు నరసింహ, టీడీపీ నాయకులు శివప్రసాద్ రాజు, బొంతల శివ నాగేశ్వరరావు, మహేష్ రెడ్డి, ఆదినారాయణ, యానాది రాజు తదితర ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చవితి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



**పాయకాపురం, సెప్టెంబర్ 8, ( నేటి దర్శిని )**
స్థానిక 64వ డివిజన్ కండ్రిక కాలనీలో ప్రతి ఏటా నిర్వహించే వినాయక చవితి మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. శ్రీలక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకుడు కె. రవికుమార్, కమిటీ సభ్యులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ.. చవితి మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు నిత్య అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

# హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై అవగాహన




**-రవితేజ ఒకేషనల్ కాలేజీ మరియు దీప్తి జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం**

**అమలాపురం, సెప్టెంబర్ 8, (నేటి దర్శిని)**
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా నగరం రవితేజ ఒకేషనల్ కాలేజ్ మరియు మామిడికుదురు దీప్తి జూనియర్ కాలేజ్ నందు దిశా, జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ మరియు రాజోలు సామాన్య ఆసుపత్రి ఐ సి టీ సి సెంటర్ సంయుక్త భాగస్వామ్యంతో ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్ లో భాగంగా విద్యార్థులకు హెచ్ ఐ వి మరియు ఎయిడ్స్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచనలతో దిశా డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా ఆధ్వర్యంలో నగరం రవితేజ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్స్, మరియు దీప్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు మరియు ఏం రంగారావు అధ్యక్షతన నిర్వహించిన హెచ్ ఐ వి మరియు ఎయిడ్స్ అవగాహనా కార్యక్రమంలో జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ అమలాపురం టీ ఐ ప్రాజెక్ట్ మేనేజర్ జి శ్రీనివాస్ మాట్లాడుతూ సమిష్టి అవగాహన మరియు సరైన చికిత్స ద్వారా హెచ్.ఐ.వి.ని నివారించవచ్చు అన్నారు. అంతే కాకుండా హెచ్ ఐ వి ఎలా వ్యాపిస్తోంది , నివారణ మార్గాలు, సమాజంలో హెచ్ వి నివారణలో యువత పాత్ర మొదలగు అంశాలు గురించి తెలియజేశారు. అనంతరం ఏపీసాక్స్ ముద్రించినటువంటి ఐ.ఈ.సి మెటీరియల్ ని విద్యార్థులకు అందజేశారు. ఆరోగ్య స్థితిని తెలుసుకోండి అనే క్యుఆర్ కోడ్ స్కాన్ చేసి సెల్ఫ్ రిస్క్ అసెస్ మెంట్ ఫ్రొమ్ ఎలా చెయ్యాలి అని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజోలు సామాన్య ఆసుపత్రి ఐ సీటీసీ కౌన్సిలర్ వి ప్రతాప్ కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థులకు రిస్క్ అసెస్మెంట్ పై అవగాహన కల్పించారు. అలాగే నగరం రవితేజ జూనియర్ కాలేజ్ సిబ్బంది దీప్తి జూనియర్ కాలేజ్ సిబ్బంది కళాశాల జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఔట్రీచ్ స్టాఫ్ కే శ్రీనివాస్ అధ్యాపకులు - మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆక్వారంగ సమస్యలు పరిష్కరించకుంటే పంటవిరామం ప్రకటిస్తాం




**-ఆక్వా రైతు బ్రతుకు పోరాటం సభలో రాష్ట్ర నాయకుడు గాంధీభగవాన్ రాజ్**

**-అమలాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సభకు భారీగా తరలివచ్చిన ఆక్వారైతులు**

**అమలాపురం, సెప్టెంబర్ 8, ( నేటి దర్శిని )**
ఆక్వా రంగాన్ని నమ్ముకున్న రైతులను నష్టాల ఊబిలోకి నెడుతున్న స్థిరీకరణ లేని ధరల పెంపుదలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు అన్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా మేతల తయారీదారులనుంచి సానుకూల నిర్ణయం వెలువడితే సరి, లేకుంటే ఆ కంపెనీలకు చెందిన మేతల కొనుగోళ్లు నిలిపివేయాలని, వచ్చే ఏడాది నాటికి పంటకాలం పూర్తిచేసుకుని ఆతరువాత పంట వేయకుండా పంట విరామం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆక్వారంగంలో ఎదుర్కొంటోన్న సమస్యలపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో నిర్వహించిన ఛలో అమలాపురం కార్యక్రమంలో భాగంగా ఆక్వారైతు బ్రతుకు పోరాట సభ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన నాయకులతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న ఆక్వా రైతు సంఘ నాయకులు, రైతులు భారీ స్థాయిలో తరలివచ్చారు. అంతకుముందు అమలాపురం వై.జంక్షన్ నుంచి సభావేదిక వరకు భారీగా ఆక్వా రైతులంతా ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆక్వారైతు సంఘ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో రాష్ట్రంలోని నలుమూలల నుంచి తరలివచ్చిన నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రంగంలో సీడ్ దశనుంచి పంట చేతికి వచ్చి రొయ్యల ఎగుమతి వరకు ఆక్వా రైతులు దగా పడుతున్నారన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉన్నా కానీ రైతుల నుండి తక్కువకు కొనుగోలు చేయడం జరుగుతోందని, రైతులకు న్యాయం జరిగేలా కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. అప్పుడా చట్టం ఉన్నా అది రైతులకు వర్తించని దుస్తితి ఉందన్నారు. ప్రభుత్వం చొరవ చూపించి ఆక్వారంగంలో తిష్టవేసిన సిండికేట్, దళారీ వ్యవస్థలను రూపుమాపాలని కోరారు. సమస్యలు పరిష్కారం చూపకుంటే వచ్చే ఏడాది మార్చి తరువాత పంటలు వేయకుండా రైతులంతా పంట విరామం ప్రకటించాలని సూచించారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి పంటవిరామమే శరణ్యం అన్నారు. ఆక్వా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తృవటపల్లి నాగభూషణం మాట్లాడుతూ ఆక్వా రైతు వరుస నష్టాలతో చావు బ్రతుకుల మధ్య పోరాడుతున్నాడన్నారు. దేశ రక్షణలో జవాన్ మరణానికి ఎదురొడ్డి ఎలా తప్పక పోరాటం చేస్తాడో ఆక్వా సాగులో కూడా రైతు అదే స్థితిలో నష్టాల ఊబిలో కూడా సాగును కొనసాగిస్తున్నాడన్నారు. ఆక్వాలో సిండికేట్ వ్యవస్థ లేకుండా చేసి భారంగా మారుతోన్న ఆక్వామేతల ధరలను స్థిరంగా ఉండేలా చేయాలని డిమాండ్ చేశారు. ఆక్వారంగంలో రైతులు ఎదుర్కొంటోన్న సమస్యలపై పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఫీడ్ ధరలు తగ్గించుకుంటే 30 వ తేదీ తరువాత ఆ ఫీడ్ కంపెనీలును బ్యాన్ చేస్తామని, 57 జీవోలో ఉన్న పవర్ ఫ్యాక్టర్ నిభందన తొలగించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం 12500 విద్యుత్తు కనెక్షన్లను వెంటనే విద్యుత్తు సబ్సిడీ అమలు చేసి లోపాలను సరిదిద్దుకోవడానికి సమయం ఇవ్వాలని, ధరల విషయంలోఉన్న అస్థిరతను సరిచేసి గతంలో ఉన్న వేరియేషన్‌ను కొనసాగించాలి, అలాగే ప్రతీ పది రోజులకు మార్కెట్ రేటు నిలకడగా అమలు చేయాలని ఇంకా తదితర తీర్మానాలు చేసి అల్టిమేట్ జారీచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈదరి యశ్వంత్ కుమార్, సంయుక్త కార్యదర్శి ముదునూరి శ్రీహరి వర్మ, దాట్ల పృధ్వీరాజు, అల్లూరి రమేష్ రాజు, యాళ్ల వెంకటానందం, కాకర్ల వినాయకం, మేడిది జాన్ డేవిడ్ రాజు, చిలికాని సూర్యారావు, కొటికలపూడి కృష్ణశ్రీ, బోస్ రాజు, కొప్పుల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహితంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు విత్తనాల రవితేజ జన్మదిన వేడుకలు




**ముమ్మిడివరం, సెప్టెంబర్ 8, ( నేటి దర్శిని )**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు విత్తనాల రవితేజ మంగళవారం తన పుట్టినరోజు వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించి, ఆదర్శంగా నిలిచారు.పుట్టినరోజు వేడుకలకు కొత్త నిర్వచనం తెలియజేస్తూ పారిశుద్ధ్య కార్మికుల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాలుగు ఆవులకు 50 కిలోల దాణా పంపిణీ పంపిణీ చేసి మూగజీవాల పట్ల తన అభిమానాన్ని చాటుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గంటపాటు పనిచేసి, వారితోనే కేక్ కట్ చేసుకోవడం ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన 44 విద్యార్థులకు బహుమతులు, బిస్కెట్ ప్యాకెట్లు అందించి వారితో ఆనందాన్ని పంచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతిభావంతమైన విద్యార్థికి రూ.2,000 విలువైన బహుమతి అందించి ప్రోత్సహించారు. పవన్ కళ్యాణ్ ఆశయాల స్ఫూర్తితో ప్రజల్లోకి మరింతగా వెళ్లి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని, పర్యావరణాన్ని కాపాడుతూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలతో ముందుకు సాగుతామని రవితేజ తెలియజేయడం పట్ల పలువురు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## బాల్యవివాహాలను సమిష్టిగా వ్యతిరేకించాలి



**కాజులూరు, సెప్టెంబర్ 8, ( నేటి దర్శిని )**
కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కాజులూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్‌ఐవి మరియు ఎయిడ్స్,కౌమార దశలో గర్భధారణ, బాల్యవివాహాలు,రక్షణ చట్టాలు,లింగ ఆధారిత హింస,పునరుత్పత్తి ఆరోగ్యం అంశాలపై వకృత్వ మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వకృత్వ మరియు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బీమాబాయి మహిళా మండలి మండల స్థాయి ఇంప్లిమెంటరు డి అర్జునరావు మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రతి ఒక్కరూ సమిష్టిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి కమ్యూనిటీ ఆర్గనైజర్ వి అనితాకుమారి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ప్రమాదాల్లోకి వెళ్లకుండా చూసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణమ్మ విద్యార్థిని, విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

